క్లుప్తంగా

కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రోహిత్, శివమణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోని ప్రైవేటు కార్పొరేట్ విద్యాలయాలు అక్రమ అడ్మిషన్లు చేపడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీ ఎత్తున దోచుకుంటున్నాయన్నారు. మరోవైపు పుస్తకాలు, వివిధ రకాల కోర్సుల పేరిట రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

'ఆపరేషన్ కగార్' వెంటనే ఆపాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గుంతకల్లుటౌన్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సురేష్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యం, తెలంగాణా సరిహద్దుల్లో లక్షల మంది పారా మిలటరీ దళాలు చుట్టుముట్టి మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు, ఆదివాసులను బూటకపు ఎన్‌కౌంటర్‌లతో హత్యలు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జిలాన్, రామాంజినేయులు, షెక్షావలి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులు, ఎక్కువ మంది ప్రయాణిలతో వెలుతున్న ఆటోవాలాలకు జరిమానా విధించారు. డ్రోన్ కెమెరాలతో మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నిబంధనలు ఉల్లంగిస్తే ఆటోలను సీజ్‌చేయడంతో పాటు కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వేములపాడులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని వేములపాడులో శుక్రవారం సర్పంచు ఓంకారమ్మ ఆధ్వర్యంలో తాడిపత్రికి చెందిన ఐకేర్ షబానా ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి 50 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా నేత్ర వైద్యులు జగదీష్ పరీక్షించి 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారిని కర్నూలులోని శాంతిరాం ఆస్పత్రికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివుడు, షామీర్, రంగారెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో అధికారుల పర్యటన

గుత్తి: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శుక్రవారం అధికారులు పర్యటించారు. మున్సిపల్ డీఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యం

- మస్టర్లలో బినామీ పేర్లు
- జేబులు నింపుకుంటున్న మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు



యల్లనూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలం : యల్లనూరు	
పంచాయతీలు	21
జాబ్ కార్డులు	10,578
పనులు చేస్తున్న కూలీల సంఖ్య	7,000

యల్లనూరు: ఉపాధి హామీ పథకంలో కూలీల సొమ్ము సిబ్బంది దోచుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మస్టర్ తనిఖీలు చేయకపోవడంతో పనులకు వెళ్లకున్నా బినామీ పేర్లు రాసుకుంటూ జేబులు నింపుకుంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారుల బదిలీలు చేపట్టింది. నెల రోజుల కిందట ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లూ, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, శంకర్, అదిల్, శ్రీనివాసులు బదిలీ అయ్యారు. ఇదే అదునుగా భావించిన మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేతికి పని చెప్పారు. పని ప్రదేశంలో 10 మంది కూలీలు ఉంటే మరో 10 బినామీ పేర్లు రాసి పబ్బం గడుపుకుంటున్నారు. ఏపీఓ, ఈసీ, టీఏలు బదిలీపై వెళ్లిన రోజు నుంచి ఏప్రిల్ 30 వరకూ మస్టర్లను ఉన్నతాధికారులు పరిశీలిస్తే అసలు నిజాలు బయటపడుతాయని కూలీల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మస్టర్ తనిఖీ ఎక్కడ?

ఉపాధి హామీ పథకంలో వారానికి రెండురోజులు మస్టరు తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే అధికారులు బదిలీ అయ్యాక బినామీ పేర్లకు మరింత జోరందుకుంది. మండలంలోని నాలుగైదు పంచాయతీలు తప్ప మిగిలిన పంచాయతీల్లో ఈ తతంగం నడుస్తోంది. ఏప్రిల్ నుంచి సీజన్ ప్రారంభం అవడంతో 85 శాతం కూలీలు హాజరవుతుంటే..... మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మకై 15 శాతం బినామీ పేర్లు రాసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. పశువుల షెడ్ల నిర్మాణంలో కూడా అవినీతి చోటుచేసుకుందని మండలంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. కొన్ని పంచాయతీల్లో ఎక్కువ సంఖ్యలో పశువుల షెడ్ల నిర్మాణాలు జరిగినట్లు తెలుస్తోంది. కొన్ని పంచాయతీల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు చక్రం తిప్పుతున్నారు.

తూతూమంత్రంగా సమావేశాలు

ప్రతి బుధవారం నిర్వహించే ఉపాధి సిబ్బంది మీటింగ్ తూతూమంత్రంగా జరుగుతోంది. వారానికోసారి నిర్వహించే సమావేశాలకు కూడా సిబ్బంది తరచూ గైర్హాజరవుతుంటారు. ప్రశ్నించే వారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారు

మస్టర్లపై పర్యవేక్షణ జాడే లేదు

మస్టర్ల తనిఖీపై జిల్లా ఉన్నతాధికారులు, ఏపీడీ, ఎంపీడీఓ, ఏపీఓ, సిబ్బంది ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు , మేట్లు ఆడింది ఆట పాడింది పాట అన్న చందంగా తయారైంది. గతంలో తాడిపత్రి ఏపీడీ వెంకటరత్నం ఉన్న సమయంలో మస్టరు తనిఖీలు నిరంతరం చేసేవారు. ఇటీవల నూతనంగా ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, బాధ్యతలు తీసుకున్నారు. వారికి పంచాయతీలపై అవగాహన వచ్చేలోపు జరిగేందంతా జరుగుతుంది. జిల్లా పీడీ సలీంబాషా స్పందించి ఉపాధి పనుల్లో అవినీతిపై విచారణ చేయాలని కూలీలు కోరుతున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

మస్టర్లల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేసిన తప్పులను అరికడుతాం. ఇప్పటి నుంచి మస్టరు తనిఖీలను చేస్తాం. అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ వదిలిపెట్టం. రెగ్యులర్ ఏపీఓ లేక అవస్థలు పడుతున్నాం. ఇటీవల డ్వామా పీడీ సలీం బాషాకు సమస్య వివరించాం. త్వరలో మండలానికి ఏపీఓను నియమించనున్నారు.

– పుల్లారెడ్డి, ఇన్‌చార్జి ఏపీడీ తాడిపత్రి

తాడిపత్రికి రేపు కేతిరెడ్డి పెద్దారెడ్డి రాక

తాడిపత్రిటౌన్: తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నారన్న విషయం ఇటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అటు జేసీ బాధితుల్లో ఆనందాన్ని నింపుతోంది. ఆదివారం తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నట్లు తాడిపత్రి వైఎస్సార్‌సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసు ఆంక్షలతో దాదాపు 10 నెలలుగా ఆయన తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. పలుమార్లు ఆయన తాడిపత్రికి వచ్చేందుకు ప్రయత్నించినా పోలీసులు అడ్డుతగులుతూ వెనక్కు పంపుతున్నారు. దీంతో ఆయన తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టును ఆశ్రయించారు. గత గురువారం ఆయన తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో ఆదివారం తాడిపత్రికి రానున్నట్లు కార్యాలయ వర్గాల ద్వారా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జేసీ బాధితులు తెలుసుకుని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకులు దేవుళ్లకు మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు ఆధ్వర్యంలో తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో అమ్మవారికి 116 టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడాక తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగడాలు భరించలేక చాలా మంది వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాలు, పట్టణాలు ఇళ్లు, పొలాలు వదిలి మరో ప్రాంతానికి తరలి వెళ్లారు. ఇలాంటి తరుణంలో తాడిపత్రికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాక చాలా మందిలో ఆశలు నింపుతోంది.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో ఓ కారు అదుపు తప్పి పల్టీలు కొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బెంగళూరుకు చెందిన రత్నమ్మ, శశికళ, ఇందు తమ బంధువులతో కలసి మంత్రాలయానికి బయలుదేరారు. శుక్రవారం వేకువజామున బసినేపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే డ్రైవర్ నిద్ర మత్తులో తూలడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో గాయపడిన ముగ్గురు మహిళలను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ల ఢీ - ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డు శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లు ఢీ కొని ధను, శ్రీరామ్ అనే యువకులు గాయపడ్డారు. గడేకల్‌కు చెందిన వారు బైక్‌లో గుత్తికి వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీ కొంది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



పెద్దవడుగూరులో ఆది శంకరాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ఆదిశంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఆయన చిత్ర పటాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలో శుక్రవారం రాత్రి రామానుజాచార్యుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శ్రీ రామానుజచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆదిశేష వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుమునుపు పట్టణంలోని రెడ్డివారిపాలెంలో వెలసిన కోదండరామ స్వామి దేవాలయంలో రామానుజచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆర్డీటీని సమష్టిగా కాపాడుకుందాం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుత్తి రూరల్: ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆర్డీటీకి విదేశీ నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకపోవడంపై పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. అంతకుముందు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ర్యాలీగా వచ్చి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వారు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మియాదవ్, నాయకులు రంగస్వామి, కేఎం.రంగనాయకులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నిరుపేదలకు సేవలందిస్తోన్న ఆర్డీటీపై ఆంక్షలు విధించడం సబబుకాదన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగేలా అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లలితకు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగరాజు యాదవ్, నాయకులు గురుప్రసాద్‌యాదవ్, సీవీ.రంగారెడ్డి, హుస్సేన్ పీరా, మల్లయ్యయాదవ్, హరినాథ్‌రెడ్డి, సూర్యప్రకాష్(చిన్న), ఎల్‌ఐసీ హరినాథ్‌రెడ్డి, డ్యాడీ, హరిబాబు, రాజేష్, పవన్, బింగికిరణ్, ఫయాజ్, మున్నా, అన్వర్, అన్సర్, గాలినరశింహారెడ్డి, నాగిరెడ్డి, చిన్నపుల్లప్ప, జీపు రమణ, వైపీ.బాబు, చంద్ర, బ్రహ్మ, రాజు, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్, దస్తగిరి, తిమ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, రమణ, నజీర్ పాల్గొన్నారు.

అమరావతికి ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు



గుత్తి బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

గుత్తి: అమరావతిలో ప్రదాని మోదీ సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో గుత్తి బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా ఒక్క బస్సు కూడా రావడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. రెండు గంటలైనా ఒక్క బస్సు కూడా రాలేదని ప్రయాణికులు వాపోయారు.ఒక వేళ బస్సులు సభలకు తలించేటట్లు ఉంటే ముందుగానే ప్రకటించాలి కదా అని ప్రయాణికులు ప్రశ్నించారు.బసస్సులు రాకపోవడంతో వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రైతులకు పనిముట్ల పంపిణీ

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేశారు. రూ.9లక్షల విలువ చేసే పనిముట్లను యాడికి మండలానికి చెందిన 35 మంది రైతులకు, రూ.16 లక్షల విలువ చేసే పనిముట్లను పెద్దవడుగూరుకు చెందిన 45 మంది రైతులకు ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు, వ్యవసాయ సహాయ సంచాలకుడు వెంకటరాముడు, ఏఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డిని కలిసిన సాకే ఓబులేసు, బోయ రామచంద్ర

పామిడి: గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని శుక్రవారం ఎస్సీ, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులు సాకే ఓబులేసు, బోయ రామచంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమపై నమ్మకముంచి ఆయా విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఎంపిక సహకరించిన వైవీఆర్‌తోపాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడతామన్నారు.

విద్యుత్ ప్రమాదాలు అరికట్టండి



లైన్‌మెన్లకు సూచనలిస్తున్న ఈఈ పద్మనాభ పిళ్లై

యల్లనూరు: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా కిందస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఈఈ పద్మనాభ పిళ్లై సూచించారు. శుక్రవారం యల్లనూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మరమ్మతులు చేసే సమయంలో, లైన్ క్లియర్(ఎల్‌సీ) తీసుకునేటప్పుడు, తిరిగి రిటర్న్ చేసేటప్పుడు ప్రమాదాలు ఎలా నివారించాలో అవగాహన కల్పించారు. డీఈ వసంతయ్య, ఏఈ రవీంద్ర, ఏడీఈ కార్యాలయ అధికారి పద్మనాభరెడ్డి, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా అనిల్‌కుమార్ నాయక్



తాడిపత్రి రూరల్: తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా అనిల్‌కుమార్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రెండో అడిషనల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అనిల్ కుమార్‌నాయక్ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చారు. తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న క్రిష్ణవేణిని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఒకటో అడిషన్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

5 నుంచి ఆధార్ క్యాంపులు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి, తురకపల్లి, తొండపాడు, కొజ్జేపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో ఈ నెల 5 నుంచి 15 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 5, 6 తేదీల్లో బసినేపల్లి, 7, 8న తురకపల్లి, 12, 13న తొండపాడు, 14, 15 తేదీల్లో కొజ్జేపల్లి సచివాలయాలలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ప్రజలు, విద్యార్థులు తమ ఆధార్ కార్డులలో తప్పులు, పేరు మార్పు లేదా అడ్రస్ మార్పు సరిచేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించామని ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 17 వరకూ రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. అలాగే కోచింగ్ సెంటర్లకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి పరీక్షల్లో ఉత్తీర్ణులైయ్యేలా తీర్చిదిద్దుతారన్నారు.తల్లిదండ్రులు శ్రద్ధవహించి శిక్షణ తరగతులకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు: మండలంలోని తెలికి గ్రామంలో శుక్రవారం ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న పశుగ్రాసం దగ్ధమైన సంఘటన చోటు చేసుకోంది. వివరాలు.. చింతలచెరువు గ్రామానికి చెందిన రైతు రంగనాథ కల్లూరులో పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా.. తెలికి వద్ద పశుగ్రాసానికి విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో సుమారుగా రూ.30 వేలు విలువ చేసే గ్రాసం అగ్నికి ఆహుతైందని బాధిత రైతు వాపోయాడు.

బాలికలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి



గుంతకల్లులో మాట్లాడుతున్న ఐసీపీఎస్ అధికారిణి వెంకటేశ్వరి



తాడిపత్రిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సాజిదాబేగం



బీకేఎస్‌మండలం రోటరోపురంలో మాట్లాడుతున్న అన్నపూర్ణ



యల్లనూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజామణి



పామిడిలోని సచివాలయం-3లో అవగాహన సదస్సు

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్/యల్లనూరు/పామిడి/బుక్కరాయసముద్రం: బాలికలు ఆత్మస్థైర్యం, ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని అంబేడ్కర్ నగర్, పక్కీరప్ప కాలనీ, దిద్దికొట్టాల తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతులు జూన్ 10 వరకూ కొనసాగుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ సేఫ్టీ, వ్యాయామం, ఆటలు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస సూపర్‌వైజర్లు శ్రీదేవి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

- తాడిపత్రి పట్టణంలోని నందలపాడు ట్రిబుల్ ఎస్ ఆర్ ఎం హైస్కూల్‌లో శుక్రవారం కిశోరి వికాసంపై సమ్మర్ క్యాంప్‌ను సీడీపీఓ సాజిదాబేగం ప్రారంభించారు. అలాగే బంకమడి వీధిలోని పాఠశాలలో సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, ఎంఎస్‌కేలు, ఎస్ఎంలు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు హాజరయ్యారు.
- యల్లనూరు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ రాజామణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మనోహర్‌బాబు, యల్లనూరు జీఎంఎస్‌కేలు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.
- పామిడి పట్టణంలోని గాయత్రి కాలనీలో ఉన్న సచివాలయం-3లో శుక్రవారం గుత్తి ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఈ.రామలక్ష్మి, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- బుక్కరాయసముద్రం మండలంధిలోని రోటరీపురంలో వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.